క్లుప్తంగా

పేరు నమోదు ఉచితమే

మైదుకూరు : విద్యుత్ మీటర్ బిల్లులలో ఇంటి యజమాని పేరు నమోదు ఉచితంగానే చేస్తామని మైదుకూరు ట్రాన్స్‌కో ఏడీఈ ఎంఆర్ శ్రీనివాసులరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మీటర్ బిల్లుపై ఇంటి యజమాని పేరు నమోదు చేసుకోవాలంటూ కొందరు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని ఆయన తెలిపారు. విద్యుత్ బిల్లులపై పేరు లేనిపక్షంలో పేరు నమోదుకు మైదుకూరులోని మండల విద్యుత్ కార్యాలయంలో కానీ, సబ్ డివిజన్ కార్యాలయంలో కానీ సంప్రదించాలని ఆయన కోరారు.

పశువులకు బీమా చేయించుకోండి

రాజుపాళెం : పశువులకు వైఎస్సార్ పశు బీమాను చేయించుకోవాలని రాజుపాళెం, పెద్దముడియం మండలాల పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని టంగుటూరు గ్రామంలోని పశు వైద్యశాలలో శుక్రవారం వైఎస్సార్ పశుబీమా పథకం, గొర్రెలు, మేకలలో నట్టల నివారణ గురించి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.30 వేల గేదెకు మూడు సంవత్సరాలకు రూ.398 ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు. అలాగే మూడు నెలలకోసారి గొర్రెలకు, మేకలకు ఏలిక పాముల నివారణ మందు తాపడం వల్ల ఆరోగ్యంగా ఉండి, బరువు పెరుగుదలకు ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏవీఓ సిద్ధేశ్వరి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

21వ తేదీన వాహనాల వేలంపాట

బద్వేలు అర్బన్ : పట్టుబడిన టాటాఏస్ వాహనానికి ఈనెల 21న మార్కెట్‌యార్డు ఆవరణలోని ఎస్‌ఈబీ స్టేషన్‌లో వేలంపాట నిర్వహించనున్నట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.మురళీమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ వేలంపాటలో పాల్గొనదలచిన వారు ఎస్‌ఈబీ స్టేషన్‌లో నిర్దేశించిన రుసుములో 50 శాతం డిపాజిట్‌గా చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని, పూర్తి వివరాలకు 9440902606 నెంబరును సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి హోమియో డాక్టర్ ఎస్.రాజేశ్వరి పేర్కొన్నారు. మండలంలోని మూలవారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలు, గుడ్లు, ఆకుకూరలు, పండ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవాలని, ఫాస్ట్ ఫుడ్ తినరాదన్నారు. వడదెబ్బ తగలకుండా నివారణ మందులను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిశంకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

21న ఆలయ భూములకు వేలం

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో ఉన్న శ్రీ మాధవ, ఆంజనేయ, ఈశ్వర, వీరభద్ర దేవస్థానములకు సంబంధించిన ఆలయ భూములకు 21వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు దేవస్థానం ఆవరణలో వేలం పాట నిర్వహించబడునని దేవాలయ అధికారులు తెలిపారు. మొత్తం 73.41 ఎకరాలకు రెండు సంవత్సరాల కౌలుకు వేలం వేయబడునని తెలిపారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి

గోపవరం : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఉక్కపోతతో చిన్నారులు అల్లాడిపోతున్నారని అధిక శాతం తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మీటరు సౌకర్యం లేని కేంద్రాలకు వెంటనే ఏఈ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. అలాగే మీటరు సౌకర్యం ఉండి ఫ్యాన్లు, లైట్లులేని వాటికి వెంటనే సమకూర్చాలని సిబ్బందిని ఆదేశించారు. మీటరు కోసం దరఖాస్తు చేసుకున్న కేంద్రాలకు ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు వెంటనే మంజూరు చేయాలన్నారు.

సమృద్ధిగా ఎరువులు



కొండూరు రైతుభరోసా కేంద్రానికి వచ్చిన ఎరువులు

అట్లూరు : రైతులకు కొరత లేకుండా సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉన్నాయని శుక్రవారం మండల వ్యవసాయ అధికారి రామకృష్ణయ్య తెలిపారు. మండల పరిధిలోని కొండూరు, కుంభగిరి రైతు భరోసా కేంద్రాలకు 20 టన్నులు 400 బస్తాలు 28-28-00 ఎరువు చేరిందన్నారు. అవసరమైన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రం నుంచి తీసుకెళ్లాలన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఎరువులు రైతులకు కొరత లేకుండా ఉంచామన్నారు. త్వరలో అన్ని రైతు భరోసా కేంద్రాలకు 28-28-00తో పాటు యూరియా కూడా వస్తుందన్నారు.

వ్యాపారులంతా ఐకమత్యంగా ఉండండి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : కూరగాయల మార్కెట్ వ్యాపారులంతా ఐకమత్యంగా ఉండి ప్రజలకు అసౌకర్యం లేకుండా చేయాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. తాత్కాలిక కూరగాయల మార్కెట్ నిర్మాణం పూర్తయి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మార్కెట్‌లో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మార్కెట్‌లోని అన్ని రకాల వ్యాపారులతో కలసి వైఎస్సార్ మున్సిపల్ మార్కెట్ అసోసియేషన్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా వల్లి బాషా, ప్రధాన కార్యదర్శిగా ఖాసీం, గౌరవాధ్యక్షులుగా జాఫర్ హుసేన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దాదాపీర్, ఉపాధ్యక్షులుగా షబ్బీర్, సుభాన్, వేణుగోపాల్‌రెడ్డి, ఖాజామొహిద్దీన్, కార్యదర్శులుగా అల్లాబకాష్, ఖాజావల్లి, కోశాధికారిగా మహేంద్రలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాపారులు అందరూ ఐకమత్యంతో మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఆర్.అహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ

ప్రొద్దుటూరు మండల పరిధిలోని మీనాపురం జగనన్న కాలనీలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 23,500 మందికి జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణం కంటే ముందుగానే ప్రభుత్వం విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. త్వరగా లబ్ధిదారులు ఇళ్లలో చేరే అవకాశం ఉందన్నారు. విద్యుత్ చార్జీలపై ప్రతిపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయని తెలిపారు. ఈఈ జి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కడప పార్లమెంట్ పరిధిలో 93వేల జగనన్న ఇళ్లు నిర్మిస్తుండగా ఇందులో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మాత్రమే 23,500 ఇళ్లు మంజూరు చేశారన్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను రూ.2కోట్ల వ్యయంతో పనులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. మూడు నాలుగు నెలల్లో పనులు పూర్తవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఈ రమణ, డీఈ శ్రీనివాసులరెడ్డి, రూరల్ ఏడీఈ సుధాకర్‌రెడ్డి, కన్‌స్ట్రక్షన్ ఏడీఈ భరణి కృష్ణ, ఏఈలు నరసింహారెడ్డి, ప్రియదర్శన్‌రెడ్డి, వేణుగోపాల్, రజనీకాంత్‌రెడ్డి, కృష్ణకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ,శిశు సంక్షేమానికి ప్రత్యేక చొరవ

చాపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టును ప్రారంభించిన ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



ప్రాజెక్టు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : రాష్ట్రంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పని చేస్తున్నారని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన చాపాడులో ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ ప్రాజెక్టును శుక్రవారం రఘురామిరెడ్డి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ తీసుకుని విస్తరించారన్నారు. ప్రతి నియోజకవర్గంలో రెండు ప్రాజెక్టులు ఉండేలా నిర్ణయించారని చెప్పారు. గతంలో ప్రొద్దుటూరు, బద్వేలులో ఉన్న నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలను నియోజకవర్గ పరిధిలో ఉండే మైదుకూరు, ఖాజీపేట మండలాలు ఒక ప్రాజెక్టుగా, చాపాడు, దువ్వూరు, బ్రహ్మంగారిమఠం మండలాలు ఒక ప్రాజెక్టుగా చేసి చాపాడు కేంద్రంగా చేశారని తెలియజేశారు. ఈ నిర్ణయంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం సంపూర్ణంగా అందుతుందన్నారు. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు ఆయా గ్రామాలలో స్థలాలు చూపితే రూ.11లక్షలతో పక్కా భవనం నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది బాగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మహబూబ్ బీ, ఐసీడీఎస్ సీడీపీఓలు సావిత్రమ్మ, హైమావతి, ముంతాజ్, రాజేశ్వరి, అరుణ, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, మండల వైద్యాధికారి రాజేష్ కుమార్, ఎంఈఓ రవిశంకర్, సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మి, కళావతి, సౌజన్య, వరలక్ష్మి, ధరణి, మాజీ జెడ్పీటీసీ బాలనరసింహారెడ్డి, పీవీ రమణారెడ్డి, అన్నవరం రామోహన్‌రెడ్డి, జయరామిరెడ్డి, వెంకట్‌రెడ్డి, జయసుబ్బారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ఓబులరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరుడికి పల్లకీ సేవ

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోగల శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామికి శుక్రవారం పల్లకీ సేవ నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని ఉదయం ఉత్సవమూర్తికి విశేష అభిషేకాలు, పూలు, సువర్ణ ఆభరణాలతో అలంకారం నిర్వహించారు. నంది వాహనంపై కొలువుదీర్చి బిల్వార్చన, అష్టోత్తర నామావళి, ధూప దీప నైవేద్యం, కర్పూర హారతి, ఆలయ ప్రాకారోత్సవాలను మంగళ వాయిద్యాల నడుమ భక్తుల నామ స్మరణలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా చక్రస్నానం



చక్రస్నానం నిర్వహిస్తున్న వేదపండితులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటంరోడ్డులో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వార్ల చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రారంభమైన వార్షికోత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని కారపురెడ్డిపల్లెలో వెలసిన కొత్తగంగమ్మ వార్షికోత్సవ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆకుపూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

మార్కెట్లోకి హోండా షైన్ -100 సీసీ బైక్ విడుదల



బైక్‌ను మార్కెట్లోకి విడుదల చేస్తున్న సీఐ యుగంధర్

ప్రొద్దుటూరు క్రైం : యంఆర్ హోండా షోరూంలో శుక్రవారం సాయంత్రం హోండా టూ వీలర్ వారి హోండా షైన్ -100 సీసీ టూ వీలర్‌ను ట్రాఫిక్ సీఐ యుగంధర్ మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల తయారీలో హోండా కంపెనీకి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అలాంటి సంస్థ నుంచి అతి తక్కువ ధరలో అత్యధిక మైలేజీతో వాహనం 100 సీసీ రావడం ప్రస్తుత పెట్రోల్ ధరలతో పోల్చుకుంటే ప్రజలకు బాగా ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ ముమ్మడిరెడ్డి మహేంద్రారెడ్డి, నరేంద్రారెడ్డి, జీఎం సందీప్‌కుమార్, షేక్షావలి, సేల్స్ మేనేజర్ గోపినాథ్‌రెడ్డి, ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లు ఇంధన పొదుపు పాటించాలి



మాట్లాడుతున్న కడపజోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు ఇంధన పొదుపు పాటిస్తూ సంస్థ పురోగతికి తోడ్పాటు అందించాలని సంస్థ కడప జోన్‌ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం కడప రీజియన్‌లో ఇంధన పొదుపు, ప్రమాద రహిత డ్రైవింగ్‌పై సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈడీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్లు విధి నిర్వహణలో మెలకువలు పాటించడం ద్వారా ఇంధనాన్ని పొదుపు చేయవచ్చన్నారు. గతంలో ఇంధన పొదుపు పాటించి సంస్థకు మంచి పేరు తీసుకువచ్చిన వారిని స్ఫూర్తిగా తీసుకుని విధులు నిర్వర్తించాలన్నారు. ముఖ్యంగా ప్రతి డ్రైవరు సమయపాలన పాటించాలని, మద్యానికి దూరంగా ఉండాలని, ప్రయాణీకుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం డ్రైవింగ్‌లో నిపుణులైన వారు పలు అంశాలపై శిక్షణ ఇచ్చి అనుమానాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈ లక్ష్మిభాస్కర్, బద్వేలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ట్రాఫిక్ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాలబాటలో పయనింపజేయాలి

ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగుల సేవలను స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నగర శివార్లలోని జోనల్ వర్క్‌షాప్, జోనల్ స్టోర్స్, టైర్ రీట్రేడింగ్ షాపులో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి కష్టపడి పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందాలని సూచించారు. అలాగే ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతుగా చేయూతనందించాలని కోరారు. అందరి సమన్వయంతో ఆర్టీసీ ఉన్నత స్థానంలో నిలువగలదని వివరించారు. రాష్ట్రంలో కడపజోన్‌ను నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని, అందుకు ప్రతి ఉద్యోగి సహకారాన్ని అందించాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు పరమేశ్వర, బ్రహ్మయ్య, ప్రమీళాదేవి, బాబు, ఎర్రిస్వామి, యల్లాస్వామి, సుధాకర్, ఎస్ఎస్ సింగ్ తదితరులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్క్స్ మేనేజర్ అజంతుల్లా, సీఓఎస్ హరినాథ్‌బాబు, అసిస్టెంట్ వర్క్స్ మేనేజర్ రవీంద్రబాబు, మునీంద్రుడు, రఫీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ, ఉపాధి కోసం దరఖాస్తుల ఆహ్వానం

పులివెందుల టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్కిల్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్, కౌశల్ వికాష్ యోజన ద్వారా పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలకు అనుగుణంగా ఆయా రంగాలలో శిక్షణ ఇచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేయడం జరిగింది. పట్టణంలోని న్యాక్‌లో నిర్వహించనున్న అసిస్టెంట్ సర్వేయర్, అసోసియేట్ ఎలక్ట్రికల్, అసిస్టెంట్ ఎయిర్ కండిషనర్, కుట్టు యంత్రం ఆపరేటర్, టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, జూనియర్ ఎక్సకావాటర్ ఆపరేటర్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని.. ఈ శిక్షణకు నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులకు క్వాలిఫైడ్ సిబ్బందిచేత శిక్షణ ఇచ్చి అనంతరం సర్టిఫికెట్లను ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. శిక్షణకు 18 ఏళ్ల నుంచి 28 ఏళ్లలోపు నిరుద్యోగ యువత అర్హులని.. ఈనెల 25వ తేదీలోపు 8వ తరగతి నుంచి టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ చదివిన వారు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు న్యాక్ శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టకూడదు

చెన్నూరు : బాల కార్మికులను పనుల్లో పెట్టుకోవడం నేరమవుతుందని చైల్డ్ లేబర్ ఆఫీసర్ మునిస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని దుకాణాల వద్దకు వెళ్లి దుకాణాల యజమానులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. దీనిపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఈనెల 1వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. అందులో భాగంగా శుక్రవారం చెన్నూరులో పాత రోడ్డు నుంచి కొత్త రోడ్డు వరకు అన్ని కూల్ డ్రింక్ షాపులు, చికెన్ షాపులు, కిరాణా షాపులు, హోటళ్లు, బేకరీ షాపులు వద్దకు వెళ్లి లేబర్ యాక్టు గురించి వివరించారు. 18 సంవత్సరాల పిల్లలను పనిలో పెట్టుకోకూడదని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ నిషేధిత చట్టంపై అవగాహన

జమ్మలమడుగు : లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని కచ్చితంగా ప్రతి ఒక్కరూ పాటించాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శాంతికళ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి స్కానింగ్ సెంటర్ ప్రభుత్వ నిబంధనలకు ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకుని స్కానింగ్ అర్హత ఉన్నవారు మాత్రమే చేయాలన్నారు. స్కానింగ్‌సెంటర్‌కు వచ్చిన ప్రతి గర్భిణి వివరాలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. లింగనిర్ధారణ గురించి చెప్పకూడదన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ రాజేశ్వరి, ఎన్జీ సుబ్బారెడ్డి, సీఈఓ శ్రీనివాసులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి

సింహాద్రిపురం : వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభించాలని ప్రకృతి వ్యవసాయ మండల ట్రైనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బలపనూరు గ్రామ పంచాయతీ పరిధిలోని బొజ్జాయిపల్లెలో ఐసీఆర్పీ వెంకటేశ్వరమ్మ పొలంలో 200 కేజీల టైపు-1 ఘన జీవామృతాన్ని రైతులతో కలిసి తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల సారవంతం కావడానికి మన పూర్వీకులు అవలంభించిన పాత పద్ధతులను పాటించాలన్నారు. రసాయానిక ఎరువులతో భూ సారం దెబ్బ తింటుందన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు ఆశ్రయించాలని తెలిపారు.

డిప్యుటేషన్‌లతో విధులకు ఆటంకం

గోపవరం : మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న వ్యవసాయ సిబ్బంది (వీఏఏలు) డిప్యుటేషన్‌పై మరోచోటికి వెళ్లడంతో విధులకు ఆటంకం ఏర్పడింది. మండలంలో 6 రైతుభరోసా కేంద్రాలు ఉండగా అన్నింటికి సిబ్బంది ఉండేవారు. గతేడాది జూన్‌లో ప్రభుత్వం రైతులకు మంజూరు చేసిన క్రాప్ ఇన్సూరెన్స్‌లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలు రావడంతో ఆ సమస్య నుంచి గట్టెక్కేందుకు కొందరు వీఏఏలు ఉన్నతాధికారులతో మాట్లాడుకుని డిప్యుటేషన్‌పై మరో చోటికి వెళ్లారు. వారి స్థానాల్లో ఇప్పటి వరకు రెగ్యులర్ సిబ్బంది రాకపోవడంతో ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. రెండు రైతుభరోసా కేంద్రాలకు సంబంధించి ఒకరు చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. బ్రాహ్మణపల్లె వీఏఏ మెడికల్ లీవ్‌పై వెళ్లగా, టీ.సండ్రపల్లె, రాచాయపేట, బేతాయపల్లె, గోపవరం రైతుభరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది డిప్యుటేషన్‌పై వెళ్లారు. ప్రస్తుతం కాలువపల్లె వీఏఏ టీ.సండ్రపల్లెకు ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నాడు. గోపవరంకు ఇన్‌చార్జిగా ఏఈఓ విజయ్, రాచాయపేట, బ్రాహ్మణపల్లె ఆర్బీకేలకు ఏఈఓ ఓబయ్య ఇన్‌చార్జి వీఏఏగా కొనసాగుతున్నారు. బేతాయపల్లె ఆర్బీకేకు సంబంధించి ఇంకా ఎవరిని నియమించలేదు. ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో వర్షాలు కురిసిన వెంటనే సాగుకు రైతులు సన్నద్ధం కానున్నారు. ప్రస్తుతం అన్ని రైతుభరోసా కేంద్రాల్లో జీలగలు, జనులు సబ్సిడీ ద్వారా రైతులకు అందిస్తున్నారు. రెగ్యులర్ సిబ్బంది కేంద్రాల్లో లేకపోవడంతో ఉన్న సిబ్బంది ఎప్పుడు వస్తారో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రైతుభరోసా కేంద్రాలకు రెగ్యులర్ సిబ్బందిని నియమించి రైతుల ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఖాతాదారుల సేవలో ఏపీజీబీ ముందంజ



రుణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాకేశ్ కశ్యప్

ప్రొద్దుటూరు కల్చరల్ : ఖాతాదారుల సేవలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ముందుందని ఏపీజీబీ చైర్మన్ రాకేశ్ కశ్యప్ పేర్కొన్నారు. స్థానిక ఏపీజీబీ ప్రధాన శాఖ కార్యాలయంలో శుక్రవారం బ్యాంకు ఖాతాదారుల సౌకర్యార్థం సరళ రుణకేంద్రాన్ని చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు అన్ని రకాల సేవలను అందిస్తున్నామన్నారు. రుణాలను సులభతరంగా అందించేందుకు సరళ రుణ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. దీని వల్ల రుణ ప్రక్రియ మరింత సులభతరం అవుతుందన్నారు. ఖాతాదారులకు డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాలైన పీఎంజేజేవై, పీఎంఎస్‌బీ, ఏపీవై తదితర పథకాలలో చేరి వారి కుటుంబ భవిష్యత్‌కు మంచి బాట వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజరు శ్రీదేవి, చీఫ్ మేనేజరు రమేష్ కుమార్, సీనియర్ మేనేజరు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శులు

బద్వేలు అర్బన్ : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది యూనస్‌బాషా తెలిపారు. బద్వేలు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బడిమానివేసిన బాల కార్మికులను గుర్తించుటకు స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ విజయచంద్ర, ప్రభుత్వాసుపత్రి ఆర్‌జీఎఫ్‌కే కౌన్సిలర్ భరతలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్లు కట్టిన వెంటనే కనెక్షన్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

ప్రొద్దుటూరు : వినియోగదారులు విద్యుత్ కనెక్షన్ కోసం డిపాజిట్ కట్టిన వెంటనే సర్వీసు ఇవ్వాలని కడప ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ తెలిపారు. స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫీల్డ్ ఆఫీసర్లు అందరూ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. డీపీటీ స్కీం ప్రాసెస్ కంప్లీట్ చేయాలని, విద్యుత్ ఫీడర్ల అంతరాయం తగ్గించాలని సూచించారు. అదనపు లోడు చార్జీలు వసూలు చేయాలని తెలిపారు. విద్యుత్ బకాయిలను త్వరగా వసూలు చేయాలని, మీటర్ రీడర్స్ ప్రతి నెల నిర్ణీత సమయంలో రీడింగ్ తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఈఈ శ్రీనివాసులురెడ్డి, డీఈఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో గంగాగౌరి సమేత అగస్త్యేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా వేకువ జామున స్వామికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను వేద పండితులు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగాగౌరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేద పండితులు వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శంకర్‌బాలాజీ, ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

కడప సెవెన్‌రోడ్స్ : ఎన్నికల సమయంలో అంగన్వాడీలకు బీజేపీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర నాయకులు రామభూపాల్ విమర్శించారు. శుక్రవారం జెడ్పీ సభా భవనంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ నూతన విద్యా విధానంలో లోపాలను సవరించాలన్నారు. ఐక్య పోరాటాలు ఉధృతం చేయడం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ఐసీడీఎస్‌కు కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గించడం దారుణమని ధ్వజమెత్తారు.